క్లుప్తంగా

సస్పెన్షన్ ఎత్తి వేయాలి

మునుగోడు : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సుంకరి భిక్షం గౌడ్‌పై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మాదగోని నరేందర్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన మునుగోడులో విలేకర్లతో మాట్లాడారు.

నిత్యావసర వస్తువులు అందజేత

చిట్యాల : మండలంలోని నేరడ గ్రామంలో పేద కుటుంబానికి చెందిన పగిల్ల వినోద్‌కుమార్ కండరాల క్షీణత వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో అతడికి సమిష్టి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఇరవై ఐదు కేజీల బియ్యంతోపాటు 14 రకాల నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి మహేష్ పాల్గొన్నారు.

'తెలంగాణకు అన్యాయం చేస్తున్న బీజేపీ'

చండూరు : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. కృష్ణా జలాలపై తెలంగాణకు వచ్చే వాటాను తేల్చకుండా కాలయాపన చేస్తూ తెలంగాణ ప్రాంతానికి తీవ్ర అన్యాయం చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ఆరోపించారు. సోమవారం చండూరు మండల కేంద్రంలోని మాదగోని నరసింహ భవన్‌లో జరిగిన మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బండమీది వెంకన్న అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చందుపట్లకు చేరుకున్న ఉత్సవమూర్తులు



సీతారాముల ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న గ్రామస్తులు

నకిరేకల్, కేతేపల్లి : శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా కేతేపల్లి మండలం బండపాలెం గుట్టపై తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు ముగియడంతో సోమవారం నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి సీతారాముల ఉత్సవమూర్తులను బెస్త బోయిలు పల్లకీలో తీసుకువచ్చారు. ఉత్సవమూర్తులకు చందుపట్ల, బండపాలెం గ్రామాల ప్రజలు మంగళహారతులలో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రెండు ఆలయాల చైర్మన్లు మేడవరపు కిషన్‌రావు, మీనారెడ్డి, ఎంపీటీసీ ఇమడపాక లక్ష్మీవెంకన్న, పూజారి ముడుంబ రఘు, వెంకట్‌రెడ్డి, నాగేంద్రబాబు, విక్రంరెడ్డి, ప్రవీణ్ వడ్డెబోయిన యాదగిరి, మంగినెపల్లి వెంకటయ్య తదితరులు ఉన్నారు.

రామాలయంలో పవళింపు సేవ

రామగిరి (నల్లగొండ) : శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజున సోమవారం రాత్రి నల్లగొండ పట్టణంలోని రామాలయంలో స్వామివారి పవళింపు సేవ వైభవంగా నిర్వహించారు. ముందుగా యంత్ర పునశ్చరణ నిర్వహించారు. బ్రహ్మోత్సవంలో సేవలు అందించిన భక్తులు, కమిటీ సభ్యులు, అర్చకులకు ఆలయ చైర్మన్ చకిలం వేణుగోపాలరావు మంగళ శాసనాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యాట జయప్రద, చకిలం సంధ్యారాణి, వేదాంతం శ్రీనివాసచార్యులు, కక్కిరేణి లక్ష్మీనారాయణ, మామిళ్ల హనుమంతు పాల్గొన్నారు.

భారత్ క్షయరహిత దేశంగా మారాలి

రామగిరి(నల్లగొండ): భారతదేశం క్షయరహిత దేశంగా మారాలని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆకాంక్షించారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో జువాలజీ డిపార్ట్‌మెంట్, తెలంగాణ స్టేట్ టీబీ కంట్రోల్ బోర్డు సంయుక్తంగా నిర్వహించిన జాతీయ క్షయ నిర్మూలన పథకం క్లస్టర్ లెవల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్టాటికల్ రిపోర్టు ప్రకారం దేశంలో ప్రతి పది మందికి నలుగురిలో ట్యూబర్క్యులోసిస్ బ్యాక్టీరియా(టీబీ) ఉందని తేలిందని అన్నారు. 2025 సంవత్సరం నాటికి టీబీరహిత దేశంగా మారేలా ప్రతిఒక్కరూ జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం స్టేట్ టీబీ కంట్రోల్ బోర్డుతో ఎన్జీ కళాశాల మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ బి. నీరజ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రప్రథమంగా టీబీపై అవగాహన ఒప్పందం జరిగిందన్నారు. జువాలజీ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి ఎస్. శ్రీనాథ్ పటేల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ డాక్టర్ శ్రీఘన, డాక్టర్ స్టెల్లా, స్టేట్ ఐఈసీ అధికారి ఎస్. జితేంద్ర, డాక్టర్ హరీష్, బి. సురేష్, ఎం. శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మునీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న క్షయ నియంత్రణ అధికారి

దూరమైన 'ఆధార్' సేవలు

- కేతేపల్లిలో ఏడాది క్రితం మూతబడిన సెంటర్
- పలు కారణాలతో మూసేసిన ఉన్నతాధికారులు
- ఇతర ప్రాంతాలకు వెళ్తున్న మండల ప్రజలు
- ఆధార్ సెంటర్‌ను పునరుద్ధరించాలని వేడుకోలు



కేతేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో గతంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్

కేతేపల్లి : మండలం కేంద్రంలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రం ఏడాది క్రితం మూసి వేయడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కేతేపల్లి మండలం మొత్తానికి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఒకేఒక్క ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. మండలంలోని 16 గ్రామాల ప్రజలు ఇక్కడి నుంచే ఆధార్ సేవలు పొందేవారు. కాగా నిర్వాహకులు నిబంధనలు పాటించక పోవడం, తిరస్కరించే దరఖాస్తులు ఎక్కువగా వస్తున్న కారణంగా ఉన్నతాధికారులు ఏడాది క్రితం ఆధార్ సెంటర్ ఐడీని సస్పెండ్ చేశారు. దాదాపు సంవత్సర కాలంం గడిచినా మండలకేంద్రంలో ఇప్పటి వరకు ఆధార్ సెంటర్ అందుబాటులోకి రాలేదు.

తప్పని ఇబ్బందులు..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు రాయితీలు పొందాలన్నా, బ్యాంకులో ఖాతా తెరవాలన్నా, పాన్‌కార్డు, పాస్ పోర్టుకు దరఖాస్తు చేయాలన్నా ఆధార్‌కార్డు తప్పనిసరి. 2015 కంటే ముందు ఆధార్ గుర్తింపు పొందినవారు యూఐడీఏ సంస్థ ఆదేశాల మేరకు సంబంధిత పత్రాలతో తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. 15 ఏళ్ల చిన్నారులు బయోమెట్రిక్ చేసుకోవాలి. ఇందుకోసం సదరు వ్యక్తులు ఆధార్ నమోదు కేంద్రానికి వెళ్లాలి. మండలంలో ఆధార్ సెంటర్ పనిచేయక పోవడంతో ప్రజలు ఇక్కడినుంచి నకిరేకల్, సూర్యాపేట పట్టణాలకు పరుగులు పెడుతున్నారు. ఆధార్‌లో ఏ చిన్న మార్పులు, చేర్పులు చేయాలన్నా వ్యయ ప్రయాసలకోర్చి ఇతర ప్రాంతాలకు వెళ్లి రావడానికి మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాలకు వెళితే ఆధార్ సేవలకు ఎక్కువ డబ్బులు వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. కొన్నిసార్లు ఆయా ప్రాంతాల్లో సాంకేతిక సమస్య తలెత్తిందని, ఆన్‌లైన్ సేవలు నిలిచిపోయాయని నిర్వాహకులు చెబితే పని కాకుండానే వెనుదిరిగి రావాల్సి పరిస్థితులు నెలకొంటున్నాయని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలకేంద్రంలో ఆధార్ సెంటర్ తెరిచినట్లయితే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన బాధలు తప్పడంతోపాటు సమయం, రవాణా చార్జీలు ఆదా అవుతాయని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సిన ప్రస్తుత పరిస్థితుల్లో అధికారులు స్పందించి కేతేపల్లిలో ఆధార్ సెంటర్ సేవలను పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆధార్ సెంటర్ తెరవాలి



మండలంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్తే ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూడాల్సి వస్తుంది. సమయం వృథా కావడంతో పాటు రవాణా చార్జీలు భారమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి కేతేపల్లిలో ఆధార్ సెంటర్‌ను తెరవాలి.

– అక్కెపల్లి రవి, కేతేపల్లి

త్వరలోనే ప్రారంభిస్తాం



ఆధార్ సెంటర్ నడిపేందుకు నిబంధనల ప్రకారం అర్హతలు ఉండి, సంబంధిత పరీక్షలో పాస్ అయి ఉంటే వారికి అవకాశం ఇస్తారు. కొన్ని కారణాలతో కేతేపల్లిలో ఆధార్ నమోదు కేంద్రం సేవలను ఉన్నతాధికారులు ఏడాది నుంచి నిలిపి వేశారు. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే ఆధార్ సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్, కేతేపల్లి

నిరుపేద కుటుంబానికి గుత్తా సుఖేందర్‌రెడ్డి అండ

కనగల్ : నిరుపేద కుటుంబానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అండగా నిలిచారు. మండల పరిధిలోని జి యడవల్లి గ్రామంలో ఇరిగి యేసు 47 ఏళ్ల వయస్సులో గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ ముగ్గురు కూతుళ్ల బాగోగులు చూసుకుంటున్నాడు. వారం రోజుల క్రితం గుండె సంబంధిత వ్యాధితో నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందగా వ్యాధి నయం కావడానికి రూ.8 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు యేసును హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. గ్రామానికి చెందిన నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి.. యేసుకు ప్రభుత్వం నుంచి రూ. 6లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించారు.

క్రీడాకారుడికి ఆర్థికసాయం

నల్లగొండ టూటౌన్ : అంతర్జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన పెద్దవూర మండల కేంద్రానికి చెందిన సల్ల మహేష్‌కు స్పైక్ షూ కోసం ఎన్సీఎం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆంజనేయులు సోమవారం రూ.11 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబు మాట్లాడుతూ త్వరలోనే ఉజ్జెకిస్తాన్ దేశంలోని తాసికెంట్ రాష్ట్రంలో జరిగే పోటీల్లో మహేష్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు సంతోష్, కొండేటి మహేష్, హరి తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం



కళ్లజోడు పెడుతున్న మున్సిపల్ చైర్మన్

నల్లగొండ టూటౌన్ : నల్లగొండ పట్టణంలోని 17వ వార్డు ఆర్జాలబావిలో కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి సోమవారం ప్రారంభించారు. ప్రజలంతా కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ మహేందర్, సీఓ జ్యోతి, స్థానిక నాయకులు మేకల యాదయ్య, జలంధర్, హనుమంతు, మధు, ఉమర్, అన్వర్, విజయలక్ష్మి, నాగరాజు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత



చెక్కు అందజేస్తున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డు జె.వెంకటయ్య కుటుంబానికి సోషల్ సెక్యూరిటీ స్కీమ్ కింద మంజూరైన రూ. 5 లక్షల విలువ గల చెక్కును సోమవారం ఎస్పీ అపూర్వ రావు తన కార్యాలయంలో అందజేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో హోంగార్డుగా బాధ్యతలు నిర్వహించిన జె.వెంకటయ్య గత ఏడాది డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. మృతుడి భార్య రాజేశ్వరికి రూ. 5లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ శేషాద్రినీరెడ్డి, హోంగార్డు ఆర్ఐ కృష్ణారావు, వెల్ఫేర్ ఆర్ఐ స్పర్జన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్పీ అపూర్వరావు అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయం మెయిన్ గేట్ వద్ద జగిని దంత వైద్యశాల, టెక్స్‌టైల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. జగిని వెంకన్న, డీఎస్పీ నర్సింహారెడ్డి, సీఐలు ఆదిరెడ్డి, గోపి, శ్రీనివాస్, ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

సమ్మేళనాన్ని విజయవంతం చేయండి



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి

కేతేపల్లి : మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. కేతేపల్లిలో నిర్వహించనున్న సభ ఏర్పాట్లను సోమవారం సాయంత్రం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమావేశానికి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఎమ్మెల్యే వెంట నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

నార్కట్‌పల్లి : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. సోమవారం మండలంలోని చౌడంపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం గ్రామంలో రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు మేకల రాజిరెడ్డి, ఎస్ఆర్ జయలక్ష్మి వెంకటేశ్వర్లు, సర్పంచ్ దుబ్బ మధు, ఉప సర్పంచ్ దామెర ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మంచినీటి సమస్య రాకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

నకిరేకల్ : వేసవి కాలంలో మంచి నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవిగంగాధర్‌రావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో నీటి సమస్య ఏర్పడినట్లయితే తన దృష్టికి తేవాలన్నారు. వరి కోతలు ప్రారంభమైనందున ధాన్యం కొనుగోలు కేంద్రాలకు స్థలాలు గుర్తించాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇటీవల పంచాయతీలకు అవార్డుల ప్రదానోత్సవం విషయంలో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని, ఇకనుంచి అలా జరగకుండా చూసుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జాన్ శాస్త్రి, ఎంపీడీఓ అండాలు, మండల పంచాయతీ అధికారి నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

దిష్టిబొమ్మ దహనం

మర్రిగూడ : రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం మండలంలోని వట్టిపల్లి చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముద్దం నర్సింహగౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిరిపంగి శ్రీనివాస్, వెంకటేష్‌యాదవ్, వంతంగి సుధాకర్, సురిగి రమేష్, జంగయ్య, కిరణ్, కారింగు దేవేందర్, గోవింద్, యాదయ్య, జీవన్, సాయికుమార్‌లు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కేతేపల్లి : మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్ అధ్యక్షతన మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమేష్ దీన్‌దయాళ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

చిదానందంకు డాక్టరేట్



చండూరు : మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేటకు చెందిన ఇడికుడ చిదానందం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ ఎస్. రఘు పర్యవేక్షణలో 'పెన్నా శివరామకృష్ణ సాహిత్యం-సమగ్ర అధ్యయనం' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను తనకు డాక్టరేట్ లభించిందని సోమవారం ఆయన తెలిపారు. చిదానందం ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని తిప్పాయిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాషోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

ధరలను నియంత్రించాలి

చిట్యాల : శుభ, అశుభ సమయాల్లో కుల వృత్తిదారులు, హిజ్రాలతోపాటు పురోహితులు అధిక మొత్తంలో పేద ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం చిట్యాల రెడ్డి యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, కమిషనర్ రామదుర్గారెడ్డికి వినతి పత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు బొబ్బలి శివశంకర్‌రెడ్డి, మాధవరెడ్డి, నరేందర్‌రెడ్డి, జమాండ్ల శ్రీనివాస్‌రెడ్డి, యాదిరెడ్డి, బుచ్చిరెడ్డి, ముప్ప శ్రీనివాసరెడ్డి, నరేందర్‌రెడ్డి, భిక్షంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి



నల్లగొండలో దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు కంచర్ల, భగత్



చిట్యాలలో నివాళులర్పిస్తున్న నాయకులు



నార్కట్‌పల్లిలో..



గట్టుప్పల మండలం తేరట్‌పల్లి గ్రామంలో..



మునుగోడు : నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

నల్లగొండ టూటౌన్ : నిజాం ప్రభుత్వానికి, దేశ్‌ముఖ్‌లకు, పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని నల్లగొండ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్‌కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా సోమవారం నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో కొమురయ్య విగ్రహానికి అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ నిజాం ప్రభుత్వ అరాచకాలను వ్యతిరేకిస్తూ ప్రజల తరఫున పోరాడిన కొమురయ్యను ప్రజలు ఎప్పటికీ మరువరని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణాచారి, అధికారులు రాజ్‌కుమార్, సల్మాబాను, బొబ్బల గోపాల కృష్ణయాదవ్, మేకల వెంకన్న యాదవ్, చీర పంకజ్‌యాదవ్, పిల్లి రామరాజు యాదవ్, తరాల పరమేష్ యాదవ్, లొడంగి గోవర్ధన్‌యాదవ్, మామిడి పద్మ, చల్లా కోటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టౌన్ : స్థానిక దొడ్డి కొమురయ్య భవన్‌లో సోమవారం కొమురయ్య చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం, జిల్లా కమిటీ సభ్యులు మల్ల మహేష్, శివ, సైదులు, సాయి, మహేష్, కోటేష్, సందీప్, తరుణ్, శ్రీను, శంకర్, సుధాకర్, రఘు, నరేందర్, సంతోష్, శ్రీకాంత్, కార్తీక్, నగేష్, భరత్ పాల్గొన్నారు.

మునుగోడు : దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మునుగోడులోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సీపీఐ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్గూరి నర్సింహ, మండల కార్యదర్శి చాపల శ్రీను, తిరిపారి వెంకటేశ్వర్లు, శంకర్, శ్రీను, దుబ్బ వెంకన్న, బీరప్ప, ఎండీ జానీ, కురుమర్తి ముత్తయ్య, మల్లేష్, నర్సింహ పాల్గొన్నారు.

చిట్యాల : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని చిట్యాలలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీటీసీ ఎద్దులపురి కృష్ణ, ఏర్పుల పరమేష్, తాడూరి చంద్రం, కుక్కల మోహన్, కోసనం అశోక్, అద్దెల సుధీర్‌రెడ్డి, అమరోజు నవీన్, అమరోజు మదన్, జిట్ట శేఖర్ పాల్గొన్నారు.

చండూరు : గట్టుప్పల మండలం తేరట్‌పల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో దొడ్డి కొమురయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గొరిగె సత్తయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. మలిగె లింగస్వామి, పగిళ్ల భిక్షం, గొరిగె శంకర్, అచ్చిన శంకర్, బండా నరేందర్, వల్లూరి శ్రీశైలం, మలిగె హరికృష్ణ, అచ్చిన బీరప్ప, అచ్చిన రాములు, మలిగె రామస్వామి, బండ స్వామి, బండ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సమీపంలో కొమురయ్య చిత్రపటానికి మాజీ జెడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, స్థానిక సర్పంచ్ దూదిమెట్ల స్రవంతివెంకటేశ్వర్లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెనిగ కనకయ్య, మట్టిపల్లి శ్రీను, జలంధర్, తొడుసురి నర్సింహ, సైదులు, బాలు, మహేష్, ముంత వెంకన్న, శేఖర్, శ్రీను, శ్రీకాంత్ పవన్, శివ తదితరులు ఉన్నారు.

నేలకొరిగిన వరిచేలు

కనగల్ : మండల పరిధిలోని రాంచంద్రపురం గ్రామంలో సోమవారం సాయంత్రం భారీ ఈదురు గాలు వర్షం కురిసింది. దీంతో కోత దశకు చేరుకున్న వరిచేలు నేలకొరిగి ధాన్యం గింజలు రాలాయి. అదేవిధంగా కురంపల్లి, పొనుగోడు, రేగట్టే, శాబ్దుల్లాపురం గ్రామాల్లో వరిచేలు నేలకొరిగి ధాన్యం గింజలు రాలిపోయయాని రైతులు వాపోతున్నారు.

రుణమాఫీ చేయాలని వినతి

శాలిగౌరారం : రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీల్లో భాగంగా రైతులకు ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అనంతరం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రామచంద్రయ్యకు వినతి పత్రం అందజేశారు. సిలివేరు జానయ్య, వెంకటేశ్వర్లు, నర్సింహ, లింగయ్య, శంకర్, నాగరాజు, జానయ్య పాల్గొన్నారు.

పెంచిన ధరలు తగ్గించాలి

నల్లగొండ టౌన్ : కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువులు ధరలతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ధరలు తగ్గించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. సోమవారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన ఐద్వా జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. మహిళలపై పెరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తున్నారన్నారు. మహిళా సంఘాలకు పావలావడ్డీ రుణాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలంతా ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, జిల్లా సహాయ కార్యదర్శి భూతం సభ్యులు అరుణకుమారి, బొరోజు ఇందిరా, చిన్నబోయిన నాగమణి, ఎస్‌కె సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాందీపని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సాందీపని ఉన్నత పాఠశాలలో ఒక్కరు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఒక్కరు చొప్పున మొత్తం ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్‌లు చల్మరాజు, ఉషారాణి తెలిపారు. మండలంలో మొత్తం 363 మంది విద్యార్థులకు గాను 361 మంది పరీక్షలకు హాజరయ్యారు.

చిట్యాల : మండల కేంద్రంలోని మూడు కేంద్రాల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్, న్యూ లిటిల్ ఫ్లవర్ స్కూల్, గ్రోన్ గ్రోవ్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. తెలుగు పరీక్షకు 533 మంది విద్యార్థులకుగాను మొత్తం విద్యార్థులు హాజరయ్యారు. పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు రమణకుమార్ తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంఈఓ నర్సింహ ఉన్నారు.

నూరు శాతం హాజరు

మునుగోడు : పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం కాగా మొదటి రోజు తెలుగు పరీక్షకు నూరుశాతం విద్యార్థులు హాజరయ్యారు. మండల వ్యాప్తంగా మొత్తం 367 మంది విద్యార్థులు ఉండగా.. వారికి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సెయింట్ జోసఫ్ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ వీరయ్య, శ్రీనివాస్, స్థానిక తహసీల్దార్ ఎం. కృష్ణారెడ్డి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

కనగల్‌లో..

కనగల్ : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని సూపరింటెండెంట్ శ్రీనివాసాచారి, డిపార్ట్‌మెంట్ అధికారి విజయలక్ష్మి తెలిపారు. మొదటి రోజు 275మంది విద్యార్థులకు 275మంది పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. పరీక్ష సరళిని ఎంఈఓ తరి రాములు పరిశీలించారు.



కేతేపల్లిలో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న ఇన్విజిలేటర్లు

ఒకరు గైర్హాజరు

రామగిరి(నల్లగొండ) : తిప్పర్తి మండలంలో సోమవారం జరిగిన టెన్త్ పరీక్షకు ఒకరు గైర్హాజరయ్యారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 171 మంది విద్యార్థులకు, జెడ్పీహెచ్ఎస్‌లో 100 మందికి రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశామని ఎంఈఓ అరుంధతి తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా జరిగిందని పేర్కొన్నారు.

నకిరేకల్ : పట్టణంలో నారాయణ పాఠశాలలో 216 మంది, సాంఘిక గురుకుల పాఠశాలలో 230 మంది, జెడ్పీ హైస్కూల్‌లో 220, ఏవీఎం జూనియర్ కళాశాలలో 211 మంది విద్యార్థులు సోమవారం పదో తరగతి పరీక్ష రాశారు. 100 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎంఈఓ మేకల నాగయ్య పరీక్ష నిర్వహణ తీరును పర్యవేక్షించారు.

కేతేపల్లి : మండలంలోని రెండు పరీక్ష కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. చెరుకుపల్లి, కేతేపల్లిలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలకు వివిధ గ్రామాల నుంచి ఉదయం 8 గంటలకే పెద్ద ఎత్తున చేరుకున్నారు. చెరుకుపల్లి పరీక్ష కేంద్రంలో 166 మందికి గాను 166 మంది, కేతేపల్లిలో 247 మందికి గాను 247 విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష నిర్వహణ తీరను చీఫ్ సూపరింటెండెంట్‌లు మురళీకృష్ణ, వెంకట్‌రెడ్డి, డీఓలు శైలజ, రమాదేవి పర్యవేక్షించారు.

శాలిగౌరారం : మండలంలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలో మొత్తం 323 మంది విద్యార్థులకు గానూ 323 మంది పరీక్షకు హాజరయ్యారు. శాలిగౌరారంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 120 మంది విద్యార్థులు, గీతాంజలి ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 112 మంది విద్యార్థులు, మాధారంకలాన్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో 91 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫ్లయింగ్‌స్క్వాడ్‌లు పరమేశ్వర్, శంకరయ్యతో పాటూ ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంఈఓ నాగయ్య, డిప్యూటీ తహసీల్దార్ సత్తార్‌లు తనిఖీ చేశారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

శాలిగౌరారం మండలంలో మూడు పరీక్ష కేంద్రాలలో ఎస్సెస్సీ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల సౌకర్యార్థం ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన చైత్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యంగలి రామకృష్ణ ఆర్థిక సహకారంతో శాలిగౌరారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఎస్ఐ సతీష్ ప్రారంభించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యంగలి రామకృష్ణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బుడిగె శ్రీనివాసులు, ప్రతినిధులు, ఎస్ఎంసీ చైర్మన్ అంబటి రమేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శేషరాజుపల్లి వెంకన్న, మాజీ డైరెక్టర్ సుల్తాన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మర్రిగూడ : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, ఆదర్శ పాఠశాలల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. హైస్కూల్‌లో 190 మంది విద్యార్థులకు 190 మంది, ఆదర్శ పాఠశాలలో 169 మందికిగాను 168 మంది పరీక్ష రాశారు. మొత్తం 358 మంది పరీక్షకు హాజరైనట్లు ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు అడపాల వాణి, రాయిస్ ఉన్నీసాబేగం, డీఓలు పద్మజ, జంగయ్యలు తెలిపారు. పరీక్షల నిర్వహణను ఎంపీడీఓ జె.వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు.